


ఇసుక స్టాక్ యార్డు ఏర్పాటుకు దరఖాస్తులు

నంద్యాల కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇసుక స్టాక్ యార్డు ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గనుల శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. నంద్యాల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, నందికొట్కూరు తదితర ప్రాంతాల్లో స్టాక్‌యార్డులు ఏర్పాటు చేయడానికి ఆసక్తి కలిగిన వ్యక్తులు ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మరిన్ని వివరాలకు జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి నంద్యాల, సెల్ నెంబర్ 9100688846కు సంప్రదించాలని కోరింది.



కర్నూలు - విశాఖ మధ్య రైలు మార్గం

- సెమీ హైస్పీడ్ కారిడార్‌కు ప్రతిపాదన
- రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్
- రెట్టింపు వేగంలో సాగిపోనున్న రైళ్లు
- కర్నూలు నుంచి విశాఖకు నాలుగు గంటల ప్రయాణం

కర్నూలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-విశాఖపట్నం మధ్య సెమీ హైస్పీడ్ రైల్వే కారిడార్ అలైన్‌మెంట్ ప్రతిపాదనకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రైలు మార్గం నిర్మాణం జరిగితే కర్నూలు నుంచి విశాఖకు నాలుగు గంటల్లో ప్రయాణం చేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన నగరాలను కలుపుతూ సెమీ హైస్పీడ్ రైల్వే కారిడార్‌ను ఆ శాఖ అధికారులు ఖరారు చేశారు. ప్రధాన నగరాల మధ్య రైలు ప్రయాణం సమయాన్ని గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ కారిడార్ పూర్తయితే కర్నూలు ప్రాంతం పారిశ్రామిక, వాణిజ్య పరంగా అభివృద్ధి చెందనుంది. రాజధాని అమరావతికి రెండు మూడు గంటల్లో చేరుకునే అవకాశం ఉంది. మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు రైలు మార్గాన్ని కూడా నిర్మిస్తే కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ రైల్వే జంక్షన్‌గా మారుతుంది. ఆ దిశగా జిల్లా ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

రాయలసీమ ముఖద్వారం కర్నూలు. హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. జిల్లాకు చెందిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ జిల్లాకు పరిశ్రమలు తీసుకొచ్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఎలాంటి పరిశ్రమలు రావాలన్నా రైలు మార్గాలు, జాతీయ రహదారులు, విమాయాన ప్రయాణ సౌకర్యం కీలకం. ఇప్పటికే హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారి ఉంది. దీనిని ఆరు లైన్ల రహదారిగా మార్చేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. కర్నూలు-చిత్తూరు వయా నంద్యాల జాతీయ రహదారి ఉంది. సూరత్ - చెన్నై వయా కర్నూలు మీదుగా జాతీయ రహదారి పనులు నిర్మాణంలో ఉన్నాయి. కర్నూలు (ఓర్వకల్లు) ఎయిర్ పోర్టు కూడా ఉంది. హైదరాబాద్, బెంగళూరుకు రైల్వేలైన్ సౌకర్యం ఉన్నా రాష్ట్ర రాజధాని అమరావతి, ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చెందుతున్న విశాఖకు కర్నూలు నగరం నుంచి రైలు మార్గం లేదు. పారిశ్రామిక, వ్యాపార అభివృద్ధికి ఇది అవరోధంగా ఉందని వ్యాపార వర్గాల వాదన. కర్నూలు - విశాఖపట్నం వయా సూర్యపేట, విజయవాడ మీదుగా సెమీ హైస్పీడ్ రైలు కారిడార్‌కు కేంద్రం ఆమోదం ముద్ర వేయడం శుభపరిణామని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రతిపాదనలతో కాలయాపన చేయకుండా తక్షణం కార్యాచరణ ప్రారంభించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

మిగతా 6లో..



రైలు మార్గం ఇలా..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గించాలన్నది ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. తెలుగు రాష్ట్రాల్లో తొలి సెమీ హైస్పీడ్ కారిడారి ఇది. శంషాబాద్ - విశాఖపట్నం వయా సూర్యాపేట, విజయవాడ మీదుగా రైల్వేలైన్‌ను ప్రతిపాదించారు. ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టులో భాగంగా విశాఖపట్నం నుంచి కర్నూలు వయా విజయవాడ, సూర్యపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్ కర్నూలు మీదుగా కర్నూలుకు మరో కారిడార్ ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రాథమిక ఇంజనీరింగ్, ట్రాఫిక్ (పీఈటీ) సర్వే పూర్తయిందని, ఈ నెలాఖరులోగా రైల్వే బోర్డుకు నివేదికలు అందజేస్తారని అధికారులు పేర్కొంటున్నారు.



ప్రబలుతున్న డయేరియా

- పారిశుధ్య లోపంతో కునారిల్లుతున్న రుద్రవరం
- ఏళ్ల తరబడి పట్టించుకోని అధికారులు
- కేసులు పెరిగాక అధికారుల హడావిడి



రుద్రవరం పడమటి వీధి ఇలా..

రుద్రవరంలో గత నెల 25 నుంచి 30వ తేదీ వరకు 8 డయేరియా కేసులు నమోదయ్యాయి. వారిని నంద్యాల, ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. మళ్లీ ఈ నెల 4, 5వ తేదీల్లో మరో ఐదు కేసులు నమోదయ్యాయి. సెప్టెంబరులో ఆళ్లగడ్డలో డయేరియాతో దాదాపు 18 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. తిరిగి డయేరియా ప్రబలడంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారు. పారిశుధ్యం మెరుగుకు అధికారులు పట్టించుకోకపోవడమే దీనికి ప్రధాన కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నంద్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మూడు నాలుగేళ్లుగా జిల్లాలో ఎక్కడో ఓ చోట డయేరియా ప్రబలుతోంది. దీని వల్ల మరణాలు కూడా సంభవిస్తున్నాయి. అధికారులు దీనిని ఎదుర్కోడానికి ఏమాత్రం శ్రద్ధ వహించటం లేదు. పైగా తమ తప్పేమీ లేదని చెప్పుకునేందుకు నానాపాట్లు పడుతున్నారు. డయేరియా ప్రబలగానే ముందుగా అధికారులు అక్కడికి చేరుకుని నీటి నమూనాలు తీసుకుని పరీక్ష చేస్తున్నారు. ఆ తర్వాత డయేరియా వ్యాప్తికి నీటి కాలుష్యం కారణం కాదని, ఆ ప్రాంతంలో జరిగిన ఏదో ఒక ఫంక్షన్‌లో కలుషిత ఆహారం తీసుకోవటం వల్లే ఇదంతా జరుగుతోందని చెప్పడం పరిపాటిగా మారింది. కానీ డయేరియా ప్రతి మూడు నాలుగు నెలలకు ఓసారి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రబలడానికి నీరు కలుషితమవటమే కారణమని స్థానిక పరిస్థితులను చూస్తే ఇట్టే అర్థమవుతోంది. ప్రస్తుతం రుద్రవరం మండలంలో డయేరియా కేసులు నమోదవుతున్న ప్రాంతాల్లో డ్రైనేజీలు లేక మురుగునీరు రోడ్లపై ప్రవహించడం, డ్రైనేజీ కాలువల్లోనే మంచినీటిని సరఫరా చేసే పైపులైను ఉండటం గమనించవచ్చు. మురుగునీరు భూమిలోనికి ఇంకుతున్నా, డ్రైనేజీ కాలువల్లోని మంచినీటి పైపులైను లీకవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

అప్పటికపుడు హడావుడి..

రుద్రవరంలో దాదాపు 2350 కుటుంబాలున్నాయి. ఈ కుటుంబాలకు రెండు ఓహెచ్ఆర్ ట్యాంకులు, మూడు మినీ ట్యాంకులు, ఐదు పంపింగ్ మంచినీటి పథకాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే వీటి శుభ్రతపైన పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక మండల కేంద్రంలోని చాలా చోట్ల మురికి కాలువలు లేకుండానే సీసీ రోడ్లు నిర్మించారు. దీంతో మురుగునీరు సక్రమంగా ప్రవహించే మార్గం లేక రోడ్ల మీద ప్రవహిస్తూ మురికి కూపాలను తలపిస్తున్నాయి. అయినా అధికారులకు ఇవేమీ పట్టవు. వీటి గురించి ఎవరైనా ఫిర్యాదు చేసినపుడు లేదా పత్రికల్లో వార్తలు వచ్చినపుడు మాత్రం ఏదో నామమాత్రంగా స్పందించి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రుద్రవరంలో డయేరియా ప్రబలిన తర్వాత అధికారులు స్పందించి దళిత కాలనీలో 300 మీటర్లు డ్రైనేజీ నిర్మించాలని నిర్ణయించారు.

అవగాహన కార్యక్రమాలేవి..?

డయేరియా వంటి వ్యాధులు రాకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ముఖ్యం. ప్రజల్లో వీటిపట్ల అవగాహన లేకపోవటం వల్ల అనారోగ్యం పాలవుతున్నారు. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించటంలో విఫలమవుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక్కడ చాలామంది ప్రజలు వ్యక్తిగత మరుగుదొడ్లు వాడకుండా బహిర్భూమికి బయటకే వెళుతున్నారు. దీనివల్ల చుట్టుపక్కల అపరిశుభ్రత వ్యాపించటమే కాకుండా, కాలువలు, చెరువులు కూడా కలుషితమవుతున్నాయి. వ్యాధులు ప్రబలినపుడు జాగ్రత్తలు చెప్పే అధికారులు, సిబ్బంది ఈ సమస్యను పట్టించుకోవడం లేదు.



పూడిపోయిన డ్రైనేజీని తవ్వుతున్న పారిశుధ్య కార్మికులు (ఫైల్)

నీటి పరీక్షల స్థాయి ఏపాటిది..?

డయేరియా ప్రబలినపుడు నీటి నమూనాలను పరిశీలిస్తున్న యంత్రాంగం నీరు కలుషితం కాలేదని, ఆహారం కలుషితమవటం వల్ల వ్యాధి వ్యాప్తి చెంది ఉండవచ్చనే అనుమానాలను వ్యక్తం చేస్తుంటారు. ఆహారం కలుషితమే కారణమైతే ఏ బాక్టీరియా, వైరస్ వల్ల వ్యాధి వ్యాప్తి చెందిందీ చెప్పడం లేదు. ఈ విషయాన్ని గమనిస్తే మన వద్ద ఉన్న ల్యాబుల సామర్థ్యం ఏపాటితో అర్థమవుతున్నది. మంచినీటిని శుభ్రపరచే క్లోరినేషన్‌కు లొంగని ఎన్నో రకాల బాక్టీరియాలు, వైరస్‌లు నీటిలోకి చేరుతున్నాయి.

పారిశుధ్య లోపం వల్లే...



రుద్రవరంలో పారిశుధ్యం లోపించింది. మెరుగుపరిచే పనులపట్ల అధికారులు నిర్లక్ష్యం చేశారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం లేదు. రక్షిత మంచినీరు ప్రజలకు అందించాలి. -భాస్కర్, సీపీఐ నాయకుడు, పెద్దకంబలూరు

జీతాలు మహాప్రభో..!

- క్వాలిటీ కంట్రోల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతోనే..
- ఏడు నెలలుగా జీతాల కోసం ఎదురు చూపులు

ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని క్వాలిటీ కంట్రోల్(క్యూసీ) విభాగంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోవడంతో పూట గడవడం కష్టంగా మారింది. ఏడు నెలలుగా జీతాల లేక దసరా, దీపావళి పండులకు పస్తులు ఉన్నారు. ప్రతి ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో ఆ ఏడాదికి సంబంధించి సుమారు రూ.39 లక్షల వరకు ప్రభుత్వం వారి జీతాలకు మంజూరు చేసేది. సకాలంలో ఏడాదిపాటు జీతభత్యాలు ఇవ్వడానికి సరిపోయేవి. ప్రభుత్వం స్పందించి తగిన నిధులను వెంటనే మంజూరు చేసి న్యాయం చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు.

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): క్యూసీ విభాగంలో పని చేస్తున్న 9 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు జీతాలు రాలేదు. ఉమ్మడి జిల్లాలో మూడు డివిజన్లు ఉన్నాయి. కర్నూలు-3, ఆదోని-3, నంద్యాల-3 ఉంటారు. ప్రతి డివిజన్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌కు ప్రతి నెల జీతం రూ.19000, ల్యాబ్ అసిస్టెంట్‌కు రూ.16800, హెల్పర్‌కు రూ.15600 ప్రభుత్వం ఇస్తోంది. ఈ మేరకు ఒక్కో డివిజన్‌కు ప్రతి ఏడాది రూ.13 లక్షలు అంటే మూడు డివిజన్లకు రూ.39 లక్షలు ప్రభుత్వం విడుదల చేయాలి. ఒక్కో డివిజన్ జీతభత్యాలకు సంవత్సరానికి రూ.6,16,800 అవుతుండగా మిగిలిన రూ.6,83,200 మిగతావాటికి ఖర్చు చేయాలి. జీతాల గురించి పలుమార్లు అడిగినా ఫలితం లేదు. కొందరు ఉద్యోగులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వం మంజూరు చేసే నిధుల్లో జీతాలు పోగా మిగిలిన నిధులతో శాఖ వాహనాల అద్దెలకు వినియోగించేవారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం ముందస్తుగా నిధులను విడుదల చేయకపోవడంతోనే సమస్యలు వచ్చాయి. జిల్లాల వారిగా ఎక్కడికక్కడ క్యూసీ హెడ్ అకౌంట్‌కు కొంత నగదు జమ అవుతూనే ఉంటుంది. జిల్లాల ఈఈల అకౌంట్ నుంచి ఏ నెలకు ఎంత అమౌంట్ కావాలో డ్రా చేసుకుని జీతభత్యాలతోపాటు ఇతర పనులకు వినియోగించుకునేలా ఆ శాఖ ఉన్నతాధికారుల అనుమతి ఇస్తే ఏడాది పాటు సమస్య ఉండేది కాదు. కాని గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల హడావుడిలో పడి ఈ నిధులను మంజూరు చేయకుండా గాలికి వదిలేసింది. దీంతో అప్పటి నుంచి ఉద్యోగులకు ఇబ్బంది తప్పడం లేదు.

మిగతా 6లో..

జీతాలు మహాప్రభో..!

(5వ పేజీ తరువాయి)

ల్యాబ్ పరీక్షలు, ఇతర సామగ్రి కొనుగోలు, అద్దె వాహనాల బిల్లులు మొదలైన వాటికి సంబంధించిన నిధులు కూడా ఏడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. ప్రధానంగా అద్దె వాహనాల బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. కూటమి ప్రభుత్వమైనా స్పందించి నిధులు మంజూరుకు అనుమతించి జీతాల వచ్చేలా చూడాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతోపాటు పీఆర్ శాఖ యంత్రాంగం అనుకుంటోంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



జీతాల పెండింగ్, ఇతర నిధుల విషయంపై ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే అనుమతి రావాల్సి ఉంది. ప్రతిసారి అడుగుతూనే ఉన్నాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే నగదు డ్రా చేసి ఉద్యోగులకు జీతాలను చెల్లిస్తాం. క్యూసీ పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా చూస్తాం.

- మురహరిరెడ్డి, క్యూసీ ఈఈ,

శ్రీశైల మల్లన్నకు వెండి వస్తువులు



దేవస్థానం అధికారులకు వెండి వస్తువులను అందజేస్తున్న దాతలు

శ్రీశైలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల కైంకర్యాల కోసం వెండి వస్తువులను రాజమహేంద్రవరానికి చెందిన కె.రామిరెడ్డి అనే భక్తుడు బుధవారం స్వామివారికి సమర్పించాడు. 790 గ్రాముల మూడు వెండి కిరీటాలు, 435 గ్రాముల వెండి పళ్ళెం, 485 గ్రాముల శఠారి ఉన్నాయి. దాతలు ఈ విరాళాన్ని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో అధ్యాపక ఎం. పూర్ణానందం పర్యవేక్షకుడు కె. అయ్యన్నకు అందజేశారు. సమర్పణ అనంతరం దాతలకు వేదాశీర్వచనం పలికి స్వామివార్ల శేషవస్త్రాన్ని, ప్రసాదాలను అందజేసి సత్కరించారు. అదేవిధంగా నిత్యాన్నదాన పథకానికి బుధవారం హైదరాబాదుకు చెందిన చుక్కపల్లి లక్ష్మి అనే భక్తురాలు రూ.1,00,116/- విరాళాన్ని పర్యవేక్షకుడు సి. మధుసూదన్‌రెడ్డికి అందజేశారు.

బాలల మేధో వికాసానికి బాటలు

- వివిధ ప్రోగ్రామ్స్ ద్వారా టాలెంట్ వెలికితీత
- ప్రయోగాత్మక శిక్షణలతో ముందుకు పోతున్న కర్నూలు యువకుడు



వ్యక్తిత్వ వికాస శిక్షకుడు వి. సయ్యద్ మహమ్మద్ వసీ

కర్నూలు కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలల్లో సృజనాత్మక భావాలు అంతర్లీనంగా దాగి ఉంటాయి. వాటిని గుర్తించి ప్రోత్సహిస్తే వారు అసాధ్యాలను సుసాధ్యాలుగా మార్చేసుకుంటారు. పిల్లల ఐక్యూ (ఇంటలిజెంట్ క్వోషియంట్) గుర్తించి బోధన చేయాలి. దీంతో పదో ర్యాంకు విద్యార్థిని కూడా నెంబర్ వన్ విద్యార్థితో పోటీ పడేలా చేయవచ్చు. ఇదే తీరున బాలల మేధో వికాసానికి బాటలు వేస్తున్నాడు కర్నూలుకు చెందిన యువకుడు వి. సయ్యద్ మహమ్మద్ వసీ. టీమ్ 360 డాట్ ఆర్గనైజేషన్ అనే సంస్థ ద్వారా విద్యార్థుల సృజనాత్మకతను ముందే గుర్తిస్తున్నారు. వివిధ ప్రోగ్రామ్స్ ద్వారా వారిలోని టాలెంట్‌ను వెలికితీస్తున్నారు. అంతేకాకుండా ప్రయోగాత్మక శిక్షణలతో విద్యార్థులు చదువులో ముందుకు పోయేందుకు కృషి చేస్తున్నారు.

బాలల బంగారు భవిష్యత్తుకు ఉపయుక్తంగా..



బాలలకు పుట్టుకతో వారికి ఉన్న ఇంటెలిజెన్స్, టాలెంట్ తెలుసుకొని ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయి. పిల్లల్లోని లోపాలను సరిదిద్దేందుకు టీమ్ 360 శిక్షణలు చాలా ఉపయోగపడతాయి. బ్రెయిన్‌లో ఉన్న లెఫ్ట్, రైట్‌లలో ఏది స్ట్రాంగ్ ఏది వీక్‌గా ఉందో తెలుసుకొని స్ట్రాంగ్‌గా ఉన్న దాన్ని ఇంకా సమర్థవంతంగా తయారు చేసే టెక్నిక్స్ అందుబాటులో ఉన్నాయి. అవి సైంటిఫిక్ పరంగానూ నిరూపితమయ్యాయి. ఇక్కడ ఇస్తున్న శిక్షణలన్నీ సైంటిఫిక్‌గా నిరూపితమైనవే. నగరంలోనూ వివిధ విద్యాసంస్థల్లో వారి ఆహ్వానం మేరకు వివిధ సందర్భాల్లో వెళ్లి విద్యార్థులు సమగ్ర ఫలితాలు రాణించేందుకు శిక్షణలు కూడా ఇస్తున్నాను.

- వి. సయ్యద్ మహమ్మద్ వసీ, టీమ్ 360 డాట్ ఆర్గనైజేషన్

చదువులో ముందుకు పోతున్నా



మొదట సెల్‌ఫోన్లు, టీవీ, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండమని చెప్పారు. తర్వాత ప్రతి అర గంటకు ఒక గ్లాసు నీళ్లు తాగాలని సూచించారు. వాటిని పాటిస్తూ శిక్షణలు తీసుకుంటున్నా. ఫోన్, టీవీ చూడకపోవడం వల్ల నాకు చాలా సమయం కలిసి వచ్చినట్లు అవుతోంది. జ్ఞాపకశక్తి పెరుగుదలకు ఇస్తున్న సూచనలు చాలా బాగా ఉపయోగపడుతున్నాయి.

- రిషీ కేశవ, 4వ తరగతి

బాలల కోసం ప్రత్యేకంగా శిక్షణలు

మహ్మద్ వసీ కొంత కాలంగా బిర్లా గేటు సమీపంలోని కేతు జగదీష్ ప్లాజాలో 'వసీ టీమ్ 360 డాట్ ఆర్గనైజేషన్' ప్రారంభించి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు మానసికంగా ధృఢంగా, తమలోని ఐక్యూ సామర్థ్యాలు పెంచేలా ఈ శిక్షణ ఉపయోగపడుతున్నాయి. అలాగే పిల్లలు కళ్లకు గంతలు కట్టుకొని వస్తువులు గుర్తించే స్థాయికి తీసుకు వెళుతున్నారు. పిల్లల మేధోశక్తిని పెంచే బ్రెయిన్ స్ట్రాంగ్, రిడ్జ్ ఎనాలిసిస్ ప్రోగ్రాములు, పిల్లల్లోని లోపాలను అధిగమించడానికి, వారిలోని సామర్థ్యాలు బలోపేతం చేయడానికి మైండ్ ఎక్స్‌ప్లోరేషన్, బ్రెయిట్ ఇంజనీరింగ్ ప్రోగ్రాంలను నిర్వహిస్తున్నారు. మూడు నెలల పాటు తీసుకునే ఈ శిక్షణతో విద్యార్థులు చదువులో మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

సామాజిక సంఘటనలే స్ఫూర్తి...

కర్నూలుకు చెందిన మహమ్మద్ వసీ 2020లో ఎంబీఏ పూర్తి చేశారు. ఆ సమయంలో సోషల్ మీడియాలో వచ్చిన పలువురు విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలు అతన్ని ఆలోచింపజేశాయి. చదువులో వెనుకబాటు, ఆత్మన్యూనతా భావన, మానసిక ఒత్తిళ్లు ఇలాంటి విద్యార్థుల రుగ్మతలకు కారణాలు అవుతున్నాయి. వాటిని నివారించేందుకు ఆతనికి జైపూర్‌లోని 'టీమ్ 360 డాట్ ఆర్గనైజేషన్' ఇచ్చే శిక్షణలు ఆకర్షించాయి. అక్కడ ఇచ్చే మైండ్ యాసెరేషన్ ప్రోగ్రాం ద్వారా మెదడులో వీక్‌గా ఉన్న న్యూరాన్స్‌ను ఎలా బలోపేతం చేయవచ్చో సైంటిఫిక్‌గా శిక్షణలతో నిరూపిస్తారు. అలాగే ఎగ్స్ట్రా సెన్సోరీ ప్రిషప్షన్ ప్రోగ్రాం ద్వారా జ్ఞాపక శక్తి పెంచుకోవచ్చు. వెంటనే అక్కడికి వెళ్లి ఏడాది శిక్షణ తీసుకున్నారు. ఈ శిక్షణ తర్వాత వివిధ విద్యాసంస్థల్లో 1500పైగా కౌన్సెలింగ్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. వసీలోని స్ఫూర్తిని గుర్తిస్తూ జైపూర్ టీమ్ 360 డాట్ ఆర్గనైజేషన్ సంస్థ ఆయన్ను ఉమ్మడి తెలుగు రాష్ట్రాలో ఆ ఆర్గనైజేషన్‌కు కార్యదర్శిగా నియమించింది.

అరటి అధరహో

- టన్ను రూ.16 వేల నుంచి రూ.18 వేలు
- ఎకరాకు 20 నుంచి రూ.30 టన్నుల దిగుబడి
- రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

చాగలమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు లేనివిధంగా అరటి ధర పెరుగూ పోతోంది. గతంలో అరటి టన్ను రూ.7 వేలు నుంచి రూ.12 వేలు వరకు ధర పలికింది. ప్రస్తుతం ఎగుమతులు ఊపందుకున్నాయి. పొలం వద్ద నుంచే టన్ను రూ.16 వేలు నుంచి రూ.18 వేలు వరకు ధర చెల్లించి గెలలు తీసుకెళ్తున్నారు. గత ఏడాది డజన్ అరటి పండ్లు రూ.25 నుంచి రూ.35 వరకు పలుకగా ప్రస్తుతం డజన్ రూ.60 నుంచి రూ.80 పలుకుతోంది. సుగంధాలు గత ఏడాది టన్ను రూ.10 వేలు కాగా ప్రస్తుతం రూ.22 వేలు ధర పలుకుతున్నాయి. నంద్యాల జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నారు. ఎకరాకు 1200 మొక్కలు చొప్పున రూ.60 వేలు ఖర్చు చేసి నాటుతున్నారు. సరాసరి 20 నుంచి 30 టన్నులు పైగా దిగుబడి వస్తుంది. చాగలమర్రి మండలంలో 850 ఎకరాలు, ఆళ్లగడ్డలో 20 ఎకరాలు, శిరివెళ్ల 180, రుద్రవరం 480, నంద్యాల 140, ఉయ్యాలవాడ 35, పాములపాడు 35, కొత్తపల్లి 15, పాణ్యం 274, డోన్ 580, బేతంచెర్ల 280, గడివేముల 122, బండిఆత్మకూరు 220, మహానంది 6,010, బనగానపల్లె 15, కొలిమిగుండ్ల 304 ఎకరాల్లో అరటి సాగు అవుతోంది.

'సీమ' అరటికి డిమాండ్

రాయలసీమ అరటి గెలలకు మంచి డిమాండ్ ఉంది. కేరళ, తమిళనాడు, బీహార్, పశ్చిమబెంగాల్, ఢిల్లీకి చెందిన వ్యాపారులు మధ్యవర్తులచే కొని దేశ విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. అయితే మార్కెట్ సౌకర్యం సరిగా లేకపోవడంతో అరటి రైతులు దళారులచే మోసపోతున్నారు. వ్యాపారులు చెప్పిన ధరకే తోటలను విక్రయించుకోవాల్సి వస్తోంది. టిష్యూకల్చర్ మొక్కలతో పాటు మైక్రోరిగేషన్, సమగ్ర సస్యరక్షణ, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం, ఫ్రూట్‌కేర్ యాక్టివిటీ వరకు ఒకో రైతుకు హెక్టారుకు రూ.40 వేలు వరకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సాయం అందజేస్తోంది. దీంతో పాటు పంట సాగులో శిక్షణ ఇవ్వడం, అరటి సాగు చేసే ప్రతి రైతుకు గుడ్ అగ్రికల్చర్, ప్రాక్టీసెస్ సర్టిఫికేషన్ ఇస్తోంది. కోతల అనంతరం నిర్వహణకు అవసరమైన ప్యాక్‌హౌసేస్ కోల్డ్ స్టోరేజ్‌తో పాటు బ్రాండింగ్ విదేశాల్లో అవగాహన వంటి కార్యకలాపాలకు తోడ్పాటు అందిస్తోంది.

ధరలతో ఊరట



8 ఎకరాల్లో అరటి సాగు చేశా. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం 10 టన్నులు విక్రయించా. రూ.లక్ష దాక ఆదాయం వచ్చింది. సాగుతో పాటు ధర కూడా ఆశాజనకంగానే ఉంది. ప్రభుత్వం కూడా పండ్లతోటలపై సబ్సిడీ, ఇతర ప్రయోజనాలను కల్పించాలి. -నరేంద్రరెడ్డి, రైతు, చిన్నవంగలి





చిన్నవంగలిలో సాగు చేసిన అరటి తోట

అరటికి డిమాండ్ పెరిగింది

ప్రస్తుతం అరటికి డిమాండ్ పెరిగింది. నాణ్యతను బట్టి మంచి ధర లభిస్తోంది. అరటి పంట వేసిన రైతులు సీజన్ ఎంచుకొని మంచి రకం సాగు చేయాలి. పంట ఉత్పత్తి తక్కువగా ఉండటంతో డిమాండ్ బాగా ఎక్కువై ధర పెరిగింది.

- శ్రీధర్, ఉద్యానశాఖ అధికారి, ఆళ్లగడ్డ

కర్నూలు-విశాఖ మధ్య రైలు మార్గం

(5వ పేజీ తరువాయి)

కర్నూలు నుంచి విశాఖపట్నం వయా సూర్యాపేట మీదుగా ప్రతిపాదించిన సెమీ హైస్పీడ్ కారిడార్ (రైలుమార్గం)లో ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఎనిమిది రైల్వే స్టేషన్లను ప్రతిపాదించారు. తెలంగాణలో ఎక్కువ భాగం రైలు మార్గం ఉంటుంది. కర్నూలు నగరం చెంతనే ఉన్న తుంగభద్ర నది, తెలంగాణలో ప్రవహించే కృష్ణా నదులపై రైల్వే వంతెనలు నిర్మించాల్సి ఉంది. ఈ రైలు వంతెనలు పర్యాటకులను ఆకట్టుకునేలా నిర్మిస్తారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం కర్నూలు నుంచి విజయవాడకు చేరుకోవాలంటే ఎంత తక్కువ కాదన్నా 6 గంటలు పడుతుంది. అదే విశాఖకు చేరుకోవడానికి 8-10 గంటలకు పైగా సమయం పడుతుందని అంటున్నారు. సెమీ హైస్పీడ్ కారిడార్‌లో నడిచే రైళ్లు గంటకు 200 కి.మీ.కు పైగా వేగంతో దూసుకుపోతాయని, విశాఖకు నాలుగైదు గంటల్లో చేరుకోవచ్చని, విజయవాడకు రెండు మూడు గంటల్లో చేరుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

అలా చేస్తే కర్నూలు రైల్వే జంక్షన్‌గా మారే అవకాశం

మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు, కోడుమూరు రైలు మార్గం



ప్రతిపాదనల్లో ఉంది. ఈ రైల్వేలైన్ కోసం 1970లో ఎమ్మిగనూరు వాసి ఆనాటి కర్నూలు ఎంపీ గాదెలింగన్నగౌడ్ తొలిసారిగా పార్లమెంట్‌లో గళమెత్తడంతో పార్లమెంట్ మినిట్స్ బుక్‌లో నమోదైంది. 2004లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.165 కోట్లు అవసరమని గుర్తించి సర్వే కోసం నిధులు ఇచ్చారు. మంత్రాలయం (తుంగభద్ర) రైల్వే స్టేషన్ నుంచి మాధవరం, మంత్రాలయం, ఇబ్రహీంపురం, నందవరం, ఎమ్మినూరు, ఎర్రకోట, గోనెగండ్ల, హెచ్‌కైరవాడి, వేముగోడు, కోడుమూరు, గూడూరు, నాగులాపురం, పెద్దపాడు మీదుగా కర్నూలు నగరం శివారులోని దూపాడు రైల్వేస్టేషన్ కలుపుతూ 110.70 కిలోమీటర్ల రైలుమార్గం, 14 స్టేషన్లతో అలైన్‌మెంట్ రూపొందించారు. రైల్వే ఇంజనీరింగ్, ట్రాఫిక్ సర్వేలు కూడా పూర్తయ్యాయి. సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే కార్యాలయంలో ఈ రైలుమార్గం పెండింగ్‌లో ఉంది. ఈ రైల్వేలైన్ నిర్మాణం కోసం జిల్లా వాసులు ఐదు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు. ఈ రైలు మార్గాన్ని నిర్మిస్తే కర్నూలు నుంచి తూర్పుకు సూర్యపేట, విజయవాడ సెమీ హైస్పీడ్ రైల్వే కారిడార్, పడమర వైపునకు కర్నూలు-మంత్రాలయం వయా ఎమ్మిగనూరు, ఉత్తర వైపునకు కర్నూలు - హైదరాబాద్ వయా గద్వాల, మహబూబ్‌నగర్, దక్షిణం వైపునకు కర్నూలు - బెంగళూరు వయా డోన్, గుత్తి రైల్వేలైన్లు సాగిపోతాయి. నాలుగు వైపుల రైలు మార్గాలతో కర్నూలు జంక్షన్‌గా మారే అవకాశం ఉంది. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆ మేరకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విజేతలకు బహుమతి ప్రదానం

నంద్యాల క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బుధవారం ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి విజేతకు రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులు దేశభద్రత కోసం పాటుపడాలన్నారు. సమాజంలో ప్రజల రక్షణ కోసం పోలీసులు, సైనికులు ప్రాణాలు అర్పిస్తున్నారని, వారి ప్రాణత్యాగం వల్ల అందరం సురక్షితంగా జీవిస్తున్నామని తెలిపారు. అలాంటి అమరవీరులను స్మరించుకోవడం బాధ్యత అని పేర్కొన్నారు. పోలీసుల బాధ్యతలు, వారు చేసే విధుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో పోలీసుల సవాళ్లు అనే అంశంపై పోలీస్ సిబ్బందికి నిర్వహించిన వ్యాసరచన, వక్తృత పోటీల్లో బహుమతులు అందజేశారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఏఎస్పీతోపాటు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న ఏఎస్పీ యుగంధర్ బాబు

సహకార సంఘాలకు త్రీమెన్ కమిటీలు



కల్లూరు సహకార సంఘం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మరో పది రోజుల్లో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రీమెన్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని సహకార శాఖ అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు త్వరలోనే ఎన్నికలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తామని ప్రకటించింది. అయితే వివిధ కారణాల వల్ల ఎన్నికల కసరత్తు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితులు లేవని స్పష్టం చేస్తూ సహకార సంఘాలకు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులకు పర్సన్ ఇన్‌చార్జిలుగా అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీలు తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన గ్రామస్థాయి, ఇతర ముఖ్య నాయకులు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పదవుల కోసం ఎప్పటి నుంచో కలలు కంటూ వస్తున్నారు. అయితే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా అధికారులను సంఘాలకు, బ్యాంకులకు పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించడంపట్ల అసంతృప్తితో ఉన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలోని ముఖ్య నాయకుల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా ఎమ్మెల్యేల సిఫారసుతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మరో పది రోజుల్లో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాలకు త్రీమెన్ కమిటీలు ఏర్పాటు కాకపోవడంతో సంఘాల్లోని అధికారులు గత ఖరీఫ్‌లో పంట రుణాలను కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. వాణిజ్య బ్యాంకులతో పోలిస్తే.. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలోనే దాదాపు 4 లక్షల మంది రైతులకు పంట రుణాలు ఇస్తున్నారు. ఈసారి ఖరీఫ్‌లో పంట రుణాల కోసం ఉమ్మడి జిల్లాలోని 99 సహకార సంఘాలకు రూ.100 కోట్లను కేటాయించారు. అయితే.. 80 శాతం సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు అందించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో త్రీమెన్ కమిటీలలో స్థానం సంపాదించుకోడానికి అధికార పార్టీలోని ముఖ్య నాయకులు, గ్రామస్థాయి నాయకులు తమకు తెలిసిన ఎమ్మెల్యేలు, మంత్రుల ద్వారా ప్రయత్నాలు మొదలు పెట్టారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా మల్లెల రాజశేఖర్ ప్రమాణం

ఓర్వకల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రమాణ స్వీకారం చేశారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మల్లెల రాజశేఖర్ తన **సతీమణి జ్యోతితోపాటు** కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. హుశేనాపురం గ్రామానికి చెందిన మల్లెల రాజశేఖర్ గతంలో టీడీపీ హయాంలో జడ్పీ ఛైర్మన్‌గా, అనంతరం నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. టీడీపీ బలోపేతానికి చేసిన కృషిని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు గుర్తించి టీటీడీ పాలక మండలి సభ్యులుగా ఎంపిక చేశారని మల్లెల రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధన్య వాదాలు తెలిపారు. తిరుమలకు వచ్చే భక్తులకు పాలక మండలి ఛైర్మన్, సభ్యులు మౌలిక సదుపా యాలు కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా హుశేనాపురం గ్రామ టీడీపీ నాయకులు మహబూబ్ బాషా, కేవీ మధు, శేఖరప్ప, బజారు, నాగభూషణం శెట్టి, అబ్బి, నాగరాజు, గూండాల్ నాయక్ తదితరులు మల్లెల రాజశేఖర్‌కు అభినందనలు తెలిపారు. హుశేనాపురం గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



మల్లెల దంపతులకు తిరుమల లడ్డూను అందజేస్తున్న అదనపు ఈవో

ప్రైవేట్ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నంద్యాల క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల శ్రీనివాసనగర్ ప్రధాన రహదారిలో ఉన్న శ్రీకరి ఆస్పత్రిలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఆస్పత్రి మొదటి అంతస్తులో షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో మంటలు చెలరేగాయి. ఆస్పత్రి వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను వారి సహాయకులు అప్రమత్తమై బయటకు తీసుకువచ్చారు. రోగులను మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మొదటి అంతస్తు అద్దాలను పగల గొట్టారు. అగ్నిప్రమాదం తీవ్రత అధికంగా ఉండటంతో రెండు ఫైరింజన్ల ద్వారా మంటలను ఆర్పివేశారు. ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లోని పరికరాలు, వార్డుల్లోని ఐసీయూ వెంటిలేటర్లు, ఆపరేషన్ పరికరాలు, కంప్యూటర్లు, ఏసీలు తదితర సామగ్రి మంటలకు ఆహుతైంది. ప్రమాదంలో దాదాపు రూ.కోటి వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు ఆస్పత్రి నిర్వాహకుడు డా.విజయ్‌బాబు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

విద్యార్థిపై ఉపాధ్యాయుడి దాడి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు బి.క్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న తమ కుమారుడిపై గణిత శాస్త్రం ఉపాధ్యాయుడు దాడి చేసి గాయపరిచాడని తండ్రి మనోహర్ బాబు కర్నూలు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు తరుణ్ తేజ్ ఆరో తరగతి చదువుతున్నాడని తెలిపారు. ఉదయం తరుణ్‌తేజ్‌ను గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఆనంద్ నోట్స్ చూపించమని అడిగాడన్నాడు. ఆ సమయంలో ఆయన ఆగ్రహంతో తన కొడుకును కాలితో తన్ని, షర్టును చింపి కొట్టాడని ఆరోపించాడు. విచక్షణా రహితంగా కొట్టడం వల్లే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నాడు. ఇదిలా ఉండగా కొన్ని సంవత్సరాలుగా ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడు ఆనంద్, ప్రధానోపాధ్యాయుల మధ్య వివాదం కొనసాగుతోంది. ఇది విద్యాశాఖ అధికారులకు తలనొప్పిగా మారింది.

నమ్మించి మోసం చేశాడు..


విలేకరులతో మాట్లాడుతున్న బాధితులు

మద్దికెర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామం ఆంధ్ర గ్రామీణ ప్రగతి బ్యాంకులో పని చేస్తున్న గోల్డ్ అబ్జర్వర్ కంసాలి చరణ్ తమను నమ్మించి మోసం చేశాడని మాజీ సర్పంచ్ వెంకటవర్మ, జి. ప్రతాప్, జిల్లా పరిషత్ పాఠశాల ఛైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మద్దికెరలో విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పని చేస్తున్న చరణ్ నకిలీ బంగారం తమ ఖాతాలలో పెట్టి మోసం చేశాడన్నారు. మీ బ్యాంకు ఖాతాలో బంగారు పెట్టి మళ్లీ విడిపించుకుంటానని ఒకరికి తెలియకుండా ఒకరిని 11 మందిని నమ్మించి నకిలీ బంగారు పెట్టి రూ.18 లక్షలు తీసుకున్నాడని అన్నాడు. తీరా ఇప్పుడు బ్యాంకు అధికారులు ఆ ఖాతాల్లో ఉన్న బంగారు నకిలీదని అన్నారని వారు ఆవేదన చెందారు. బ్యాంకు వారు ఆ డబ్బు చెల్లించాలంటున్నారని వాపోయారు. పోలీసులు తమపై చర్యలు తీసుకుంటామని అంటున్నారని వారు తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లామని బాధితులు బోయ రంగనాథ్, హుశేన్ సాహెబ్, తిమ్మరాజు, భాస్కర్, తదితరులు తెలిపారు.

వైసీపీకి రాజీనామా

మద్దికెర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి, మదనంతపురం గ్రామాల మాజీ సర్పంచ్ జి.ప్రతాప్, మాజీ సొసైటీ డైరెక్టర్ చిన్న నాగమ్మ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం మద్దికెరలో విలేకరులతో ఆమె మాట్లాడారు. గత ఐదేళ్లుగా వైసీపీలో ఉన్న తమకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీని అంటిపెట్టుకుని ఉన్నా తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమతోపాటు మరో పది కుటుంబాలు కూడా వైసీపీకి రాజీనామా చేశారని చెప్పారు. తామంతా ఏ పార్టీలో చేరుతామనేది తమ అనుచరులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ విద్యాకమిటీ చైర్మన్ జ్యోతమ్మ, మాజీ నీటి సంఘం ఉపాధ్యక్షులు విజయకుమార్, పార్వతమ్మ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్


బీజేపీలో చేరుతున్న వైసీపీ కౌన్సిలర్

ఆదోని టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీకు చెందిన 11వ వార్డు కౌన్సిలర్ వాసిమ్, హవన్న పేటకు చెందిన ముస్లిం మైనారిటీ నాయకుడు ఖలీద్ అహమ్మద్ బుధవారం ఎమ్మెల్యే డా. పార్థసారధి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు వైసీపీలో సరైనా ప్రాధాన్యత లేకపోవడం, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సహకారం లేకపోవడంతో తనను గెలిపించిన వార్డు ప్రజలకు ఏమి చేయలేక పోయానన్నారు. పార్థసారథితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మకం కలిగి బీజేపీలో చేరానని చెప్పారు. తన పనితీరు నచ్చి బీజేపీలో చేరడానికి కొందరు క్యూ కడుతున్నారని పార్థసారథి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, సింహం నాగేంద్ర, బీజేపీ కౌన్సిలర్‌లు వెల్లాల లలితమ్మ, చిన్న సురేష్, నాయకులు ఉపేంద్ర, నాగరాజ్ గౌడ్, మల్లిక, మధు పాల్గొన్నారు.

చాగలమర్రిలో కొండచిలువ


అడ్డవాగు సమీపంలో రహదారిపై వెళ్తున్న కొండ చిలువ

చాగలమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని అడ్డవాగు సమీపంలో పాత జాతీయ రహదారిపై బుధవారం రాత్రి కొండచిలువ భయభ్రాంతులకు గురి చేసింది. స్థానిక అడ్డవాగు సమీపంలో 10 అడుగులు ఉన్న కొండచిలువ రహదారిపై వెళ్లింది. దీంతో ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. అయితే స్థానికులు కొండచిలువను హతమార్చారు.


కారుపై ఉన్న పెద్దపులి పాదముద్రను లారీతో చూపిస్తున్న రేంజర్ శ్రీపతినాయుడు


సంఘటనా స్థలంలో సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి, అధికారులు

పెద్ద పులికి కారు ప్రమాదం

- కోతిని వెంటాడుతూ కారును తగిలి గాయపడిన పులి
- గాయాలతో నార్త్ బీట్‌లోకి..
- అహోబిళం వెళ్లే దారిలో ఈ ఘటన

రుద్రవరం/శిరివెళ్ల,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లమల రుద్రవరం నార్త్ బీట్‌లో పెద్దపులి కోతిపై దాడి చేస్తూ రోడ్డుపైకి వచ్చి వేగంగా పోతున్న కారును ఢీకొట్టి గాయపడింది. ఈ సంఘటన బుధవారం ఉదయం జరిగింది. తీవ్రంగా గాయపడ్డ పెద్దపులి అడవిలోకి వెళ్లిపోయింది. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన గంగాధర్ ఆళ్లగడ్డ పట్టణంలో ఓ వివాహానికి వచ్చి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ఏపీ 02 కేడబ్ల్యు 9786 నెంబరు గల ఈ కారులో డ్రైవరు వెంకటరమణ, గంగాధర్ తన కుటుంబసభ్యులు ముగ్గురు ముగ్గురు మహిళలతో ప్రయాణిస్తున్నాడు. పెద్దపులి కారును ఢీకొట్టడంతో డ్రైవర్ భయాందోళనకు గురై కంట్రోలు చేయలేకపోయాడు. కుడి వైపు ఉన్న విద్యుత్‌స్తంభాన్ని కారు ఢీకొట్టింది. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. కారుపై పెద్దపులి పాదముద్రలు పడ్డాయి. ఈ విషయం తెలిసి రుద్రవరం రేంజర్ శ్రీపతినాయుడు ఆదేశాల మేరకు డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి సంఘటనాస్థలానికి సిబ్బందితో చేరుకున్నాడు. రోడ్డుపై పులి చర్మం వెంట్రుకలు కనిపించాయి. గాయపడి నార్త్ బీట్‌లోకి వెళ్లిన పెద్ద పులి కోసం ఫారెస్టు అధికారులు గాలింపు చేపట్టారు. ఆత్మకూరు, శ్రీశైలం, నంద్యాల నుంచి ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. టైగర్ ప్రాజెక్టులోని రీసెర్చర్ శ్రీధర్ ఆధ్వర్యంలో బృందం అడవిలోకి వెళ్లింది. సంఘటనాస్థలానికి డిప్యూటీ డైరెక్టరు అనురాగ్ మీనా పెద్దపులిని కారు ఢీకొట్టిందన్న సమాచారం అందడంతో నంద్యాల డిప్యూటీ డైరెక్టరు అనురాగ్ మీనా రుద్రవరం సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్ద పులి కూర్చుని గీకిన చెట్టును, మలమూత్రాలు గుర్తించామన్నారు. సుమారు 10 నుంచి 11 కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. డ్రోన్‌తో పెద్దపులి లొకాలిటీ గుర్తించేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోరుతామని చెప్పారు. అటవీ ప్రాంతంలో వాహనాలు 20 కి.మీ వేగంతో వెళ్లాలన్నారు. అతివేగంతో వెళితే వన్యప్రాణులకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు.


ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చిన పెద్దపులి బోను



మాట్లాడుతున్న ఎఫ్‌డీపీటీ

సభలో అనధికార వ్యక్తులు

- దర్జాగా కూర్చున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు
- ప్రజాప్రతినిధులకు బదులు భర్తలు హాజరు
- గందరగోళంగా మండల సర్వసభ్య సమావేశం
- నాకు 30 శాతం పనులు ఇవ్వాల్సిందే
- అన్నీ టీడీపీ వాళ్లకంటే కుదరదు: ఎమ్మెల్యే విరుపాక్షి


సమావేశానికి హాజరైన వైసీపీ నాయకులు

ఆలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మండల సర్వసభ్య సమావేశం వైసీపీ సభగా మారింది. బుధవారం ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీటీసీ, సర్పంచ్‌లు హాజరు కావాల్సి ఉండగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మహిళా ప్రజాప్రతినిధులకు బదులు భర్తలు హాజరయ్యారు. కొందరు అనధికార వ్యక్తులు మైక్‌లు తీసుకొని ప్రసంగాలు కూడా చేశారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో సమావేశం గందరగోళంగా మారింది.

● నాకు పనులు ఇవ్వాల్సిందే..

ఆలూరు ఎమ్మెల్యేగా గెలిచిన తనకు నియోజకవర్గంలో 30 శాతం పనులు ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. అన్ని టీడీపీ వాళ్లకు ఇస్తే తమ పార్టీ కార్యకర్తలు ఏం కావాలంటూ అధికారులను నిలదీశారు. గోకులం షెడ్లు, పల్లె పండుగ పనులు మొత్తం వీరభద్ర గౌడ్ చెప్పిన వాళ్లకు ఎలా ఇస్తారని మండిపడ్డారు. ఈ విషయం కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇక మీదట అలా జరిగితే బాగుండదని హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ ఎంపీటీసీలమని మండల గ్రాంట్ కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తుంబలబీడు ఎంపీటీసీ రమేష్, మొలగవల్లి ఎంపీటీసీ సుమతీ భర్త బంగారు పటేల్ యాదవ్ అన్నారు. ఎందుకు ఇవ్వలేదో అప్పుడున్న ఎమ్మెల్యే జయరాంను అడగాలని నిర్లక్ష్యగా సమాధానం ఇచ్చారు. ఇక మీదట పార్టీలకు సంబంధం లేకుండా పనులు ఇవ్వాలని ఎంపీపీకి సూచించారు. ఆలూరు చెరువుల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లు నిర్మించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలవుతున్నా నిధులు లేవని, సర్పంచులు, ఎంపీటీసీలు దండయాత్రకు సిద్ధం కావాలని అందుకు తాను మద్దతుగా ఉంటానన్నారు. సమావేశంలో జడ్పీటీసీ ఏరూర్ శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు నాగవేణి, శ్రీరాములు, కోఆప్షన్ సభ్యులు బాషా పాల్గొన్నారు.

అదే రోజు చెల్లించడానికి అభ్యంతరం లేదు

● కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో రైతులు పంట ఉత్పత్తులు అమ్మిన రోజే చెల్లింపులు చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతర లేదని కమీషన్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అన్నారు. బుధవారం ద్వారక ఫంక్షన్ హాలులో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మార్కెట్ యార్డులో పర్యటించి కమీషన్ ఏజెంట్లు రైతులను దోపిడీ చేస్తున్నారని, గిట్టుబాటు ధర కల్పించడం లేదని ఆరోపించడం సబబు కాదన్నారు. తాము వ్యాపారులకు రైతులకు మధ్యవర్తులుగా ఉంటూ రైతు తెచ్చిన దిగుబడిని అమ్మిస్తున్నామని చెప్పారు. అందుకు తాము కమీషన్ మాత్రమే తీసుకుంటున్నామని, ఎక్కడ కూడా వడ్డీ తీసుకోవడం లేదని, ఇతర కత్తిరింపులు చేయడం లేదన్నారు. రైతుల దిగుబడి కొనుగోలు చేసిన రోజే వ్యాపారులు డబ్బులు ఇవ్వడం లేదని, దీంతో తాము బ్యాంకుల్లో ఓడీలు తీసుకొని, తమ ఆస్తి పత్రాలను తనఖా పెట్టి రైతులకు చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే వ్యాపారులతో మాట్లాడి కమీషన్ ఏజెంట్లకు సరుకు కొనుగోలుకు చేసిన రోజే చెల్లించేలా చూడాలని కోరారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), మార్క్‌ఫెడ్‌లు కూడా రైతులకు వెంటనే డబ్బులు చెల్లించడం లేదని, వారం నుంచి పది రోజులు పడుతోందని అన్నారు. అలాంటిది కోట్ల రూపాయల లావాదేవీలు జరిగే మార్కెట్ కమిటీలో అదే రోజు చెల్లింపులు చేయాలని ఆదేశించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను ఎమ్మెల్యే విని పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కమీషన్ ఏజెంట్లు బత్తిని నాగేంద్ర, నారాయణరెడ్డి బాలాజీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమీషన్ ఏజెంట్స్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి

'పది' విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి మెరుగైన ఫలితాల కోసం కలెక్టర్ మార్గదర్శకాలను జారీ చేశారని చెప్పారు. అకాడమిక్ సందేహాలను వివరించడానికి స్టడీ అవర్స్‌లో ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు డీఈవో తెలిపారు.

డ్రోన్ పాలసీకి క్యాబినెట్ ఆమోదం

ఓర్వకల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ పాలసీ తయారీకి బుధవారం క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రూ.1000 కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా డ్రోన్ పాలసీ -2024-2029 ఏపీ డ్రోన్ కార్పొరేషన్ రూపొందించింది. డ్రోన్ రంగంలో 40వేల ఉద్యోగాల కల్పన, రూ.3వేల కోట్ల రాబడి లక్ష్యంగా క్యాబినెట్ నిర్ణయించింది. ప్రపంచ డ్రోన్ డెస్టినేషన్‌గా ఏపీ డ్రోన్ హబ్‌గా ఓర్వకల్లు కానుంది. 300 ఎకరాల్లో డ్రోన్ తయారీ టెస్టింగ్, ఆర్ అండ్ డీ ఫెసిలిటీ ఏర్పాటు చేయనున్నారు. 25వేల మందికి డ్రోన్ పైలెట్లుగా శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్రంలో 20 రిమోట్ పైలెట్ ట్రైనింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు క్యాబినెట్‌లో తీర్మానించారు. 50 డ్రోన్ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. డ్రోన్ రంగంలో పరిశోధనలు చేపట్టే విద్యాసంస్థలకు రూ.20 లక్షల ప్రోత్సాహం అందించనున్నట్లు క్యాబినెట్‌లో తీర్మానించారు.

కార్తీక దీపోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్ బాగ్‌లో ఈనెల 15న నిర్వహించనున్న కార్తీక దీపోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయన చాంబర్‌లో నగరపాలక, ఫైర్, విద్యుత్, ట్రాన్స్‌కో, జలవనరుల, మత్స్యకార, పోలీసు శాఖల అధికారులతోపాటు కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్తీక దీపోత్సవం రోజు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, లైటింగ్, మహిళా పోలీసు, గజ ఈత గాళ్లు, ఫైరింజన్ వంటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఎంహెచ్‌వో కే.విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న పెద్దహరివాణం గ్రామానికి చెందిన గాదిలింగప్పను ఇస్పీ పోలీసులు అరెస్టు చేశారు. ద్విచక్ర వాహనంలో బుధవారం మద్యాన్ని తరలిస్తుండగా, ఎల్లెల్సీ కెనాల్ వద్ద అదుపులో తీసుకొని అతని వద్ద నుంచి 15 మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

రోగులకు అందుబాటులో ఔషధశాల

● త్వరలో క్యాజువాలిటీ సమీపంలోకి మార్పు


మందుల కౌంటర్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఔషధశాలను (మందులు ఇచ్చే కౌంటర్) ఓపీ రోగులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.కె. వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాల్లో రౌండ్స్ నిర్వహించారు. గైనిక్ బ్లాక్ వద్ద ఉన్న ఔషధశాల ఓపీ నెంబర్ 13ను ఆయన తనిఖీ చేశారు. మందులు ఇచ్చే కౌంటర్‌ను అక్కడ పని చేస్తున్న ఫార్మసిస్టు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేకుల షెడ్డు వల్ల ఎండవేడిమికి కొన్ని మందులు చెడిపోతున్నాయని సూపరింటెండెంట్ దృష్టికి తెచ్చారు. కొందరు ఓపీ రోగులు మందుల కౌంటర్ చాలా దూరంగా ఉందని సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఉన్న ఓపీ కేంద్రాల వద్దనే మందుల కౌంటర్ ఉండాలని ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం సూపరింటెండెంట్ ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్‌తో కలిసి మందుల కౌంటర్‌కు అనువైన స్థలాన్ని పరిశీలించారు. నిరూపయోగంగా ఉన్న నర్సెస్ అసోసియేషన్ భవనంలో మందుల కౌంటర్‌ను ఏర్పాటు చేసేలా ఎస్టిమేషన్ వేయాలని ఈఈని ఆదేశించారు. అలాగే మరో స్థలాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

బాలిక మృతదేహం లభ్యం

కర్నూలు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్‌లో గల్లంతైన షేకూన్ బీ బాలిక మృతదేహాన్ని బుధవారం ఉదయం లభ్యమైంది. మంగళవారం కేవీఆర్ కళాశాల వద్ద కేసీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు జారి పడి షేకూన్‌బీ గల్లంతైంది. బుధవారం ఉదయం జొహరాపురం ఉదయం నీటిలో తేలుతూ గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. షేకూన్‌బీ తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీ నాయకుడిపై దాడి

కర్నూలు క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీరామ్‌నగర్‌కు చెందిన వైసీపీ లీడర్ ముస్తాఫాపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ముస్తాఫా మంగళవారం రాత్రి గణేష్‌నగర్‌లోని రామచంద్ర మిషన్ వద్ద వెళ్తుండగా.. ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు ముస్తాఫాకు ముసుగు వేసి కొట్టారు. తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నాయకుల భూ కబ్జా

● న్యాయం చేయాలని బాధితుల బైఠాయింపు


మండగిరిలోని సర్వే నెంబర్ 352లోని పత్రాలను చూపెడుతున్న బాధితులు

ఆదోని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తమ తాత ముత్తాతల వారసత్వంగా వస్తున్న భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించేశారని చంద్ర య్య, వీరాంజనేయులు అనే వ్యక్తులు వాపోయారు. ఆదోని పట్టణంలోని మండగిరిలోని సర్వే నెంబర్ 352లోని భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని చంద్రయ్య, వీరాంజనేయులు బుధవారం ఆందోళనకు ది గారు. సర్వే నెంబర్ 352లో నిర్మాణ పనులు చేపట్టేందుకు వైసీపీకి చెందిన రామకృష్ణారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, వెంకటేశ్వ రెడ్డి వెళ్లారు. తమ తాత మూ లింటి హుస్సేనప్ప నుంచి రెండెకరాల పొలం, కొత్తింటి నరసమ్మ నుంచి మరో ఎకరా పొలం తమకు వచ్చినందని చంద్రయ్య, వీరాంజనేయులు ఆందోళనకు దిగారు. 1962లో ఈ భూమి కొన్నట్లు తమ దగ్గర రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయని బాధితులు వారికి చూపించారు. అయితే ఈ పొలాన్ని కర్రి బసమ్మ నుంచి చంద్రకాంతమ్మ అనే మహిళ కొనుగోలు చేసిందని, ఆమె అమిద్, అబీద్ అనే వారికి విక్రయిస్తే.. వారి నుంచి తాము కొన్నామని వైసీపీ నాయకులు రామకృష్ణారెడ్డి తెలిపారు. తమ భూమిని రామకృష్ణారెడ్డి కాజేశారని, ఎమ్మెల్యే పార్థసారథి న్యాయం చేయాలని బాధితులు అక్కడే బైఠాయించారు.

దేవదాయ శాఖలో రూ.1.67 లక్షల దోపిడీ

● ఈవో శ్రీనివాసరెడ్డిపై క్రిమినల్ చర్యలకు ఆదేశం

కర్నూలు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖలో ఈవోగా పని చేసిన శ్రీనివాసరెడ్డి రూ.1.67 కోట్ల నిధులను సొంత ఖాతాలోకి మళ్లించుకొని అక్రమాలకు పాల్పడినట్లు అసిస్టెంట్ కమిషనర్ సుధాకరరెడ్డి తెలిపారు. నంద్యాల మండలం ఊరుమల్వారం గ్రామంలోని రామేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి రూ.20,16,440 లక్షలు, కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ చెక్ బుక్ దొంగిలించి ఫోర్జరీ సంతకాలతో తన వ్యక్తి గత ఖాతాల్లోకి రూ. 86,65,760 నిధులు మళ్లించినట్లు గుర్తించామని తెలిపారు. సదరు ఈవోపై నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

మహానంది, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్ర పరిధిలోని వ్యాపార దుకాణాలతో పాటు కూల్‌డ్రింక్ షాపులు, హోటళ్లను బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. భక్తులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని నంద్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఖాశీం, వెంకటరాముడు తెలిపారు. పలు శాంపిళ్లను సేకరించారు. కార్తీకమాసం పురస్కరించుకొని క్షేత్రానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని కలుషిత ఆహార పదార్థాలను అందించకుండా నాణ్యత కల్గిన పదార్థాలను సక్రమంగా అందజేయాలని అన్నారు. కాలంచెల్లిన పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'హామీలు నెరవేర్చాలి'

ఆత్మకూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు భారతి, వరలక్ష్మి, ఇందిరమ్మ అన్నారు. బుధవారం స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిరసన చేపట్టి వైద్యురాలు సాజిదా ఫిర్దోస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకురాలు శాంతి, నాగలక్ష్మి, లింగమ్మ, రవణమ్మ, సామక్క తదితరులు ఉన్నారు.

పాణ్యం: ఆశా వర్కర్లకు ధరలకు అనునుగుణంగా కనీస వేతనాలివ్వాలని సీఐటీయూ కార్యదర్శి భాస్కర్ కోరారు. మండలంలోని మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సునీతకు బుధవారం డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సుబ్బరత్నమ్మ, సునంద, అభిషేకమ్మ, సారలీల, మణి పాల్గొన్నారు.

'జిల్లా కేంద్రంలో నిర్వహించాలి'

నంద్యాల కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల దినోత్సవాన్ని నంద్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించాలని బెస్త సంఘం రాయలసీమ ఇన్‌చార్జి గగ్గిర వెంకటరమణయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారికి బుధవారం ఫిషరీస్ జేడీ రాఘవ రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. బెస్త సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య, ప్రసాద్, వెంకటరాముడు, బుజ్జి పాల్గొన్నారు.

కోటి దీపోత్సవానికి ఏర్పాట్లు

మహానంది, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఈనెల 15 న జరిగే కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని జరిగే కోటి దీపోత్సవం ఏర్పాటు పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్‌తో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి ఉదయం నుంచి ఆలయం పరిసరాల్లో కూలీలతో పనులు చెయ్యించారు. కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం జరిగే పరిసరాల్లో భక్తులు పాల్గొనే విధంగా ఏర్పాటు పనులను కూలీల సహాయంతో చేయించారు. అలాగే వినాయకనంది ఆలయం, లడ్డుకౌంటర్ ప్రాంతాల్లో శుభ్రం చేయించి బండలను ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు కార్తీక వన భోజనాలను జరుపుకొనేందుకు జంగిల్ క్లియరెన్స్ పనులను నిర్వహింప చేశారు.

'సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి'

పాణ్యం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పిన్నాపురంలో అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని రైతులు తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డిని కోరారు. బుధవారం పిన్నాపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తమకు అనుభవంలో ఉన్న భూములకు ఎలాంటి నష్టపరిహారం గ్రీన్ కో సంస్థ నుంచి అందలేదని రైతులు చెప్పారు. పాయ, దొడ్డిపాడు, జానమల్ల ప్రాంతాలలోని అనుభవంలో ఉన్న రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వంలో రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. సర్పంచ్ వెంకటకృష్ణ, రైతు సంఘం మండల కార్యదర్శి ప్రసాద్, జయచంద్ర, వెంకటరమణ, శ్రీనివాసులు, శివ, వెంకటరాముడు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ

పగిడ్యాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఉషు పోటీలలో ప్రతిభ కనబర్చినట్లు హెచ్‌ఎం మధుసూదన్‌రావు తెలిపారు. ఈ నెల 3,4 తేదీల్లో శ్రీకాకుళము జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉషు పోటీలలో పాఠశాలకు చెందిన చరణ్, తరుణ్, పవన్‌కుమార్, ఇర్షాద్‌బాషా, వెంకటేష్, అన్వర్‌బాషా, వినయ్, దాను, మోహన్, మురళీకృష్ణ పాల్గొని ప్రతిభ కనబరిచారని చెప్పారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు మెమెంటోలతో సత్కరించి అభినందించారు. ఉపాధ్యాయులు రషీద్‌మియ్య, రమణరావు, పీడీ కృష్ణ, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి తదితరులు ఉన్నారు.

'రద్దు చేయాలి'

నంద్యాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆరు రోజులపాటు జరుగుతున్న లీడర్‌షిప్ రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాలను తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మధుసూదన్‌రావు మాట్లాడుతూ లీడర్‌షిప్ శిక్షణా కార్యక్రమంలో ఉన్న పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం ఉండూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం తోట రత్నంకుమార్ బుధవారం గుండెపోటుతో మరణించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెండు, మూడు జిల్లాలకు కలిపి ఒకచోట రెసిడెన్షియల్ పద్ధతిలో ప్రాథమిక ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణను అలాగే హెచ్‌ఎంలకు లీడర్‌షిప్ శిక్షణా కార్యక్రమాలను ఆరురోజులపాటు దూరంగా ఉన్న ఇతర జిల్లాల్లో ఏర్పాటు చేయడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంద న్నారు. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల ఆపార్ నమోదు, పదో తరగతి పరీక్షల నామినల్ రోల్స్, ఫీజుల చెల్లింపు, సెల్ఫ్ అసెస్మెంట్-2 పరీక్షల పనిఒత్తిడి, వయోభారంతో కొందరు ఉపాధ్యా యులు అనారోగ్యంతో ఉన్నప్పటికీ శిక్షణా తరగతులు ఏర్పాటు చేయడం బోధనకు దూరం చేయడం కిందనే పరిగణించాల్సి వస్తుం దని అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు సాంబ శివుడు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, నగిరి శ్రీని వాసులు, జిల్లా నాయకులు పుల్లయ్య, రవి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా తాగునీటి ట్యాంకులు

- గ్రామాల్లో అలంకారప్రాయంగా మారిన ట్యాంకులు
- నీటి సమస్యతో ప్రజల అవస్థలు


రుద్రవరంలో నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

పాములపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రజలు తాగునీటి సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి తాగునీటి పథకాలను ఏర్పాటు చేసింది. అయితే ఈ పథకాలన్నీ మూణ్ణాళ్ళ ముచ్చటగా మారాయి. ఉపయోగంలోలేక నీటిట్యాంకులు శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

మండలంలోని రుద్రవరం గ్రామంలో బీసీ కాలనీలోని రామలయం వద్ద 20 ఏళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ తాగునీటి పథకం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 20వేల లీటర్ల నీటి సామర్థ్యం గల నీటి ట్యాంక్‌ను అధికారులు నిర్మించారు. దీనికి గ్రామంలోని పెద్దబావి నుంచి ఈ ట్యాంకుకు పైపు లైన్లు ఏర్పాటు చేసి నాలుగేళ్లు నీటిని సరఫరా చేశారు. గత 15 ఏళ్ల నుంచి నీటి సరఫరా జరగక పోవడంతో ట్యాంక్ శిథిలావస్థ చేరుకుంది.


పాములపాడులోకేసీ కెనాల్ వద్ద నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

జూటూరు గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రాథమిక పాఠశాల వద్ద నీటిట్యాంక్‌ను ప్రభుత్వం గత 25 ఏళ్ల క్రితం నిర్మించింది. గత వైసీపీ పాలనలో ట్యాంక్ నుంచి నీరు లీక్‌లు అవుతుండటం, మరమ్మ తులు చేపట్టకపోవడంతో ఐదే ళ్లుగా నీటి సరఫరా నిలిపి వేశారు. దీంతో ట్యాంక్ శిథిలావస్థకు చేరు కుంది. ట్యాంక్ సమీపంలో ప్రాథ మిక పాఠశాల విద్యా ర్థులు, అంగన్ వాడీ కేంద్రంలోని చిన్నా రులు ఆటలు ఆడు కుంటూ ఉంటారు. పాడు బడ్డ నీటి ట్యాంక్ కూలి పోతే చిన్నా రులు ప్రమా దాల బారిన పడే ప్రమాదం ఉందని, ట్యాంక్‌ను కూల్చి వేరేచోట నూతనంగా నిర్మించి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేయాలని విద్యార్థులు తల్లితండ్రులు కోరుతున్నారు. ఇలా పాములపాడు కేసీ కెనాల్ వద్ద నీటిట్యాంక్‌ను ఏళ్ల తరబడి వినియోగించడం లేదు. ప్రభుత్వం నిధులు వెచ్చించి తాగునీటి పథకాలు ఏర్పాటు చేస్తే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తాగునీటి పథకాలు మూలన పడుతున్నాయని ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అవుతుందని ప్రజలు కోరుతున్నారు. తాగునీటి పథకాలపై దృష్టి సారించాలని, మరమ్మతులు చేపట్టి గ్రామాలలో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.


జూటూరులో ఉయోగంలో లేని ట్యాంకు

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి: ఎంపీ

మిడుతూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ బైరెడ్డి శబరి పిలుపు నిచ్చారు. రోళ్లపాడులో బుధవారం ఎంపీ శబరి సమక్షంలో ఆ గ్రామ సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డితో పాటు ఆయన వర్గీయులు 300 మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రోళ్లపాడు గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని, పశువైద్య సిబ్బందిని నియమించాలని గ్రామస్థులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం చెరుకుచెర్ల గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు చెరుకుచెర్ల రఘురామయ్య, మిడుతూరులోని తువ్వా భగీరథ రెడ్డి, తువ్వా అయ్యపు రెడ్డి నివాలకు వెళ్లి టీడీపీ సభ్యత్వ నమోదు చేయించాలని ఎంపీ సూచించారు. నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భగీరథరెడ్డి, గుండం స్వామిరెడ్డి, సీతారామిరెడ్డి, అంకిరెడ్డి, అయ్యపురెడ్డి, రామసుబ్బారెడ్డి, తిమ్మారెడ్డి, రామచంద్రుడు, గోకారి, మౌలాలి, జీవరత్నం పాల్గొన్నారు.


కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ

- నందికొట్కూరు పట్టణంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వారు ఏర్పాటు చేసిన దీపావళి దీపాలు వెలుగించు కార్యక్రమంలో, ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ శబరి పాల్గొన్నారు. గత ఏడాది ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి, కౌన్సిలర్ చాంద్‌బాషా, అశోక రత్నం, సాహెబ్‌ఖాన్, బంగారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
- నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తనిఖీ చేశారు. కళాశాలలో సమస్యలు, సిబ్బంది కొరత తదితర అంశాలపై అధ్యాపకులు ఎంపీకి వినతిపత్రం ఇచ్చారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి: ఎమ్మెల్యే

పాణ్యం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ శివారెడ్డి మాట్లాడుతూ కళాశాలకు సొంత భవనానికి ఐదెకరాల స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని హెచ్‌ఎం మేరీ సునీత కోరారు. కళాశాలకు ప్రహరీ, సొంత భవనం ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నంద్యాల పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శశికళ, టి.చంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామన్, ఎంపీటీసీలు రంగరమేష్, భాస్కరరెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రమణమూర్తి, టీడీపీ నాయకులు రామ్మోహన్ నాయుడు, రామగోవిందరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

చెక్కుల పంపిణీ

సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 9.08 లక్షల చెక్కులను బుధవారం బాధితులకు అందజేసినట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. ఎస్ అశోక్‌కుమార్‌కు రూ.25 వేలు, వెంకటరమణకు రూ. 35 వేలు, ఓంకారమయ్యకు రూ.లక్ష చెక్కును అందించారు. చాకలి పెద్దన్నకు రూ.85 వేలు, షేక్ సనాసుల్తానాకు రూ.30 వేలు, వీరబోయిన సుబ్బారెడ్డికి రూ. 1,11,740, షేక్ అబ్దుల్ రహీంకు రూ.32,500 చెక్కులను అందించారు. బోయ సుధాకర్‌నాయుడుకు రూ.1,30,381, గడ్డం నరసింహులుకు రూ.26,218, జుంటుపల్లి నరసింహులుకు రూ.56,843, మద్దిలేటి గొల్లదానరికి రూ. 1,16,928 చెక్కులను అందజేసినట్లు తెలిపారు. నాయకులు రవి, సురేష్ పాల్గొన్నారు.

గడివేముల: దుర్వేసి గ్రామానికి చెందిన కరుణాకర్‌కు రూ.56 వేలు, నరసింహులుకు రూ.26 వేలు సీఎం సహాయ నిధి నుంచి చెక్కులను ఎమ్మెల్యే గౌరు చరిత అందించారు. టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఉన్నారు

పెంచికలపల్లిలో టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

పాములపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచికలపల్లి గ్రామంలో రెండో రోజు బుధవారం టీటీడీ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ భారతీయ ఆచార వ్యవహారాల్లో ప్రతి ఆచారం వెనుక శాస్త్రీయ విజ్ఞానం ఉందన్నారు. టీటీడీ ధార్మిక ప్రవచకులు ఆమంచి వెంకటేశ్వరశర్మ మాట్లాడుతూ సమాజంలో ధార్మిక నిష్ట ఏర్పడినప్పుడే ఆత్మశక్తి పెరుగుతుందని అన్నారు. భజన మండలి అధ్యక్షుడు నాగలింగమయ్య, మౌళాలి గౌడ్, నారయణ, రాజేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి'

పాణ్యం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు తక్షణమే అందజేయాలని ఏపీ రైతు సంఘం మండల కన్వీనర్ బోయ ఎల్లాక్రిష్టుడు కోరారు. పాణ్యం తహసీ ల్దారు కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. అనంతరం అయన మాట్లాడుతూ తమ్మరాజుపల్లె ఏటిపాయ పర్క్యులేషన్ ట్యాంకు నిర్మాణాన్ని వెంటనే చేపట్టి రైతుల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. తమ్మరాజు పల్లెలోని తారు ఫ్యాక్టరీ వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోతున్నార న్నారు. వీఆర్వో బీరేంద్రకు వినతిపత్రం అందజేశారు. పుల్లయ్య, నరసింహులు, వెంకటేశ్వర్లు, కె.పుల్లయ్య పాల్గొన్నారు.

మిడుతూరు: రైతులకు పెట్టుబడి సాయం తక్షణమే అందించాలని ఏపీ రైతు సంఘం ఆధ్వ ర్యంలో మిడుతూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తహసీల్దార్ శ్రీని వాసులుకు వినతి పత్రం అందించారు. ఏపీ రైతు సంఘం జిల్లా సమితి నాయ కులు వెంకటేశ్వర్లు, నాగ శేషులు, సుధా కర్, తిరు పాలు, స్వామన్న, శ్రీధర్, బాబు, శ్రీనివాసులు, గోకారి, ఆంజ నేయ గౌడు, బీబీ, అమి నాబి, శాంతమ్మ తదితరులు పాల్గొ న్నారు.

వైభవంగా కొనసాగుతున్న కార్తీక మాసోత్సవాలు


శ్రీశైలంలో ఆకాశ దీపానికి పూజలు చేస్తున్న ఇన్‌చార్జి ఈవో, అర్చకుడు

శ్రీశైలం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీకమాసం పురష్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయ ఉత్తర మాడవీధిలో, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద అధిక సంఖ్యలో దీపారాధనలు చేశారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆకాశదీప ప్రజ్వలనకు ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగాలని గణపతి పూజను నిర్వహించి, దీపప్రజ్వలన, దీపారాధనలను జరిపారు. కార్తీక మాసోత్సవాల సందర్భంగా దేవస్థానంలో అఖండ శివ భజనలు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాత్రింబవళ్లు నిరంతరంగా జరిగే ఈ అఖండ శివ భజనల వల్ల భక్తులలో భక్తిభావాలు పెంపొందడమే గాక శ్రీశైల క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు మంచినీళ్లు, బిస్కెట్లు, అల్పాహారం ఏర్పాటు చేశారు. దర్శనానంతరం భక్తులకు అన్నదాన భవనంలో అన్నప్రసాద వితరణను చేశారు. లోకకల్యాణార్థం సాక్షిగణపతికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలాలతో నిర్వహించారు. అనంతరం విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు.

కొత్తపల్లి: కొలనుభారతి సరస్వతి అమ్మవారి క్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. బుధవారం కార్తీక మాసం పురస్కరించుకుని ఉమ్మడి కర్నూలు జిల్లాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి సహస్ర నామార్చణ, కుంకుమార్చన, పుష్పార్చణ తదితర పూజాదిక్రతువులు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా మహిళలు చారుఘోష నది ప్రాంతంలో కార్తీకదీపాలు వెలిగించి పూజలు చేశారు. అలాగే సప్త శివాలయాల్లో శివుడికి ప్రత్యేక అభిషేకాలు, బిల్వార్చన పూజాది క్రతువులు చేశారు. క్షేత్ర సన్నిధిలో చిన్నారులకు తమ తల్లిదండ్రులు అక్షరాభ్యాస క్రతువులు చేయించుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఆర్యవైశ్య సత్ర నిర్వాహకులు, కాశిరెడ్డినాయన ఆశ్రమ కమిటీ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

'క్రీడలతో మానసిక ఉల్లాసం'

శ్రీశైలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఒకటో పట్టణ సీఐ ప్రసాదరావు అన్నారు. శ్రీశై లంలో శ్రీశైలం మెగా ప్రీమియర్ లీగ్‌ను బుధవారం టాస్ వేసి ప్రారంభించారు. సీఐ మాట్లడుతూ శ్రీశైలంలో యువ కులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. తరువాత ఇరుజట్లకు అభినందనలు తెలిపి క్రీడాకారులకు మెమెంటోలను అందించారు. కార్యక్రమంలో రఘునాథుడు, మహేదర్ రెడ్డి, రవిస్వామి, ఎల్లా శేఖర్ రెడ్డి, ఆర్గనైజర్ బాబు రావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే ప్రజా సంక్షేమం'

నంద్యాల రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. బుధ వారం నంద్యాల పట్టణంలోని 40 వ వార్డు లో పట్టణ అధ్య క్షుడు మునియ్యార్ ఖలీల్ ఆధ్వర్యంలో నిర్వ హించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఫిరోజ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని అన్నారు. ప్రతి కార్యకర్త టీడీపీ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని కోరారు. సభ్యత్వ నమోదు వల్ల కార్యకర్తల జీవితాలకు మంచి భరోసా కల్గుతుందన్నారు. పఠాన్ హర్షద్, మునియార్ నవాజ్, అబ్బాస్, దర్గా జాహీద్, పఠాన్ జాకీర్, అశోక్, ఎల్లయ్య పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఫిరోజ్

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

కొత్తపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కొలనుభారతి సరస్వతి అమ్మవారి క్షేత్రం పరిధిలోని ఆర్యవైశ్య సత్రం ఆవరణలో ఆత్మకూరు ఆంజనేయస్వామి అర్చకులు మేడవరం అనిల్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, అష్టలక్ష్మి పూజాది క్రతువులు అశేష భక్తజనం మధ్య ఘనంగా నిర్వహించారు. బుధవారం కార్తీక మాసం పురస్కరించుకుని సామూహిక కుంకుమార్చన, కలశ స్థాపన, గణపతి పూజ, శ్రీరమ సమేతా సత్యనారాయణ స్వామి వ్రతం, నవ విధాభిషేకం, నవగ్రహ పూజలు, అష్టదిక్పాలక పూజలు, పంచలోకపాలన పూజలు, వేదమంత్రోచ్చరణాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది జంటలు పాల్గొన్నాయి. మధ్యాహ్నం వనభోజనం ఏర్పాటు చేశారు.


వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఉపాధి పనుల్లో రూ.4.75 లక్షల రికవరీకి ఆదేశం

- పగిడ్యాలలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

పగిడ్యాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో 2023-24 మధ్య జరిగిన పనులలో జరిగిన అవకతవకలు గుర్తించేందుకు నిర్వహించిన 18వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదికలో రూ.4,75,308 రికవరీకి అధికారులు ఆదేశించారు. పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయ సమీపంలో బుధవారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమానికి ప్రిసీడింగ్ అధికారి బాలాజీ నాయక్, ఎన్ఆర్ఈజీఎస్ పర్యవేక్షణాధికారి భాస్కర్‌నాయుడు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామాలలో ఉపాధి పనులపై తనిఖీలు చేపట్టిన వివరాలపై ఆయా గ్రామాల డీఆర్పీలు నివేదికలను చదివివి నిపించారు. మండలంలో 671 పనులకు గాను రూ. 7.31 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. కొత్త ముచ్చుమర్రి గ్రామంలో రూ. 1610, లక్ష్మాపురంలో రూ. 2,41,875, ఎం. ఘనపురంలో రూ.17625, పాత ముచ్చుమర్రిలోరూ. 2342, నెహ్రూనగర్‌లోరూ. 1,05, 180, పగిడ్యాలలోరూ. 35130, సంకిరేణి పల్లె గ్రామంలో రూ. 71546 రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. వలంటీర్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే వర్కర్లు, ఆశా కార్యకర్తలు పనులకు హాజరైనట్లు మస్టర్లలో నమోదు చేసినట్లు తనిఖీ బృందం సభ్యులు గుర్తించారు. అలాగే గోకులం షెడ్లకు సంబంధించి రికవరీకి ఆదేశించారు. ఎంపీడీవో సుమిత్రమ్మ, ఏపీడీ అన్వరాబేగం, షీబారాణి, కోర్సు డైరెక్టర్ ఏసుదాను, క్వాలిటీ కంట్రోలర్ గంగాధర్, జడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మల్లేశ్వరి, సర్పంచ్ శేషన్న తదితరులు పాల్గొన్నారు.


బహిరంగ చర్చా వేదికలో విచారణ చేస్తున్న అధికారులు

ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ

ఉపాధి హామీ పనుల్లో పగిడ్యాల ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వెళ్లడంతో బుధవారం ప్రిసీడింగ్ ఆఫీసర్‌కు బాలాజీనాయక్ విచారించారు. అయితే ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడలేదని సీపీఎం నాయకులు, పలువురు గ్రామస్థులు లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. నందికొట్కూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందించాలి
- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

డోన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలకు సంబంధించిన అధికారులతో ఎమ్మెల్యే కోట్ల సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో ప్రారంభించిన పనులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి.. బిల్లులు చెల్లింపులు ఆగిపోయాయా..? లేదంటే ఇతరత్రా సమస్యలు ఏమైనా ఉన్నాయా అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలని, బిల్లుల చెల్లింపులు జరిగేలా తగు చర్యలు తీసుకుంటానన్నారు. నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయి తీలు నియోజకవర్గంలోని రైతులకు అందేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ట్రాక్టర్లతో పాటు వివిధ రకాల యంత్రాలు రాయితీలతో ప్రభుత్వం అందిస్తోందని, అర్హులైన రైతులకు అందేలా చూడాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చిత్తశుద్ధితో వైద్యులు పని చేయాలని



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పూర్తయిన హెల్త్ సెంటర్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడంలో అధికారులు చాలెంజ్‌గా తీసుకుని పని చేయాలని ఎమ్మెల్యే కోట్ల సూచించారు. సమావేశంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీవో నరసింహులు, వ్యవసాయ ఉప సంచాలకులు అశోక్‌వర్ధన్ రెడ్డి, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, పీఆర్ ఏఈ నారాయణ, ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన వెంకట సుబ్బారెడ్డి స్వామి ఉత్సవం



సుబ్బారెడ్డి స్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఉయ్యాలవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కుందూనది ఒడ్డున వెలసిన వేణుగోపాల స్వామి ఆశ్రమంలో రెండు రోజులుగా కొనసాగిన అవధూత వెంకటసుబ్బారెడ్డి స్వామి ఉత్సవం బుధవారంతో ముగిసింది. స్వామి వారికి ఆయన శిష్య బృందం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం బిందెసేవ నిర్వహించి అభిషేకం, అలంకరణ, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. గీతా పారాయణం చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామోత్సవం నిర్వహించారు.

'ధరలను నియంత్రించడంలో విఫలం'

కోవెలకుంట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ధరల నియంత్రణలో కేంద్ర , రాష్ట్రప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని స్థానిక రోటరీ క్లబ్‌లో సీపీఎం మండల మహాసభ ఎం.సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. సీపీఎం మం డల కార్యదర్శిగా ఎం.సుధాకర్, సభ్యులుగా వెంకటలక్ష్మి, సరస్వతి, త్యాగరాజు, ఎంఎస్ వెంకటేశ్, హకీం, రవికుమార్, రాములమ్మ, రమేశ్, సరస్వతి, శివనాగలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎ.నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

చాగలమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పట్టణం లోని శ్రీ వాసవీ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. శ్రీవాసవీ విద్యాసమాజం గౌరవ అధ్యక్షుడు మురికి వేణుగోపాల్, అధ్యక్షుడు క్రిష్టం శివప్రసాద్ అధ్యక్షతన కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రఘురామ్, ఇంటర్ కరస్పాండెంట్ ఆర్ఎస్ రమణ, కమిటీ సభ్యులు, పుల్లారెడ్డి, సత్యనారాయణ, శేషయ్య, నరసింహ, చాణక్య, ప్రిన్సిపాల్ షాబుద్దీన్, ఓబులేసు, విశ్రాంత అధ్యాపకులు, అన్నా సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, భగవాన్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మహేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

'వాల్మీకి గుహల అభివృద్ధికి బుగ్గన కృషి'

డోన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలి మండలంలోని వాల్మీకి గుహల అభివృద్ధికి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎంతగానో కృషి చేశారని డోన్ వైసీపీ నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, మాజీ సింగిల్ విండో చైర్మన్ సోమేష్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో వాల్మీకి గుహలను గుర్తించి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నిధులు మంజూరు చేయించారన్నారు. వాల్మీకి గుహలను కూడా సందర్శించడానికి పలు వసతులు ఏర్పాటు చేయించారన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు ఎద్దుపెంట కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, కౌన్సిలర్ ఆర్జ్ రమణ, ధారా ప్రతాప్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ నాయుడు, పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

- పంచాయతీరాజ్ ఏఈపై జడ్పీ చైర్మన్ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల అలసత్వాన్ని ప్రదర్శించొద్దని జడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హెచ్చరించారు. బుధవారం కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నాగవేణి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పంచా యతీరాజ్ ఏఈ అన్వర్ భాషాపై ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మండలానికి వచ్చిన నిధులు నిరుపయోగం చేశారన్నారు. వీధి లైట్ల నిర్వహణలో విద్యుత్‌తో పాటు, పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యేలా వ్యవహరిస్తున్న విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై సభలో పలువురు సభ్యులు ప్రశ్నించారు. వ్యవ సాయ శాఖపై ఏవో భూమా జ్యోతి, పశువైద్య శాఖపై డా.పద్మావతి, ఆయా శాఖల అధికారులు సభలో వివరాలను వెల్లడించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు పులి ప్రకాశ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రసాదరెడ్డి, తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి, సర్పంచ్‌లు మహేశ్వరరెడ్డి, శివరాముడు, శివశంకర్, ఆదినారాయణరెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక మాస పూజలు



పాత శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవీశ్వర, బుగ్గమల్లేశ్వర, శరభేశ్వర, రామలింగేశ్వర, భీమలింగేశ్వర ఆలయాలలో బుధవారం కార్తీక మాస పూజలు వైభవంగా నిర్వహించారు. పాత శివాలయంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో సామూహిక ఒడిబియ్యం, దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, సమర్పించి పూజలు చేశారు. శివపార్వతుల ఉత్సమూర్తులచే పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

'104 సిబ్బందికి వేతనాలు చెల్లించండి'

కొలిమిగుండ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వేతనాలు చెల్లించాలని 104 వాహన సిబ్బంది ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక వైద్యులు నాగార్జునకు వినతిపత్రం సమర్పించారు. జీతాలు లేక ఇల్లు గడవడం కష్టంగా మారిందని, పిల్లలను పోషించుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

శిరివెళ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ వెంకటాపురం గ్రామ నాయకులు అరికట్ల రమణయ్య, చెరుకుల వెంకటేశ్వర్లు, నారా వెంకటేశ్వర్లు, పోకూరి జ్యోతి అన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రోత్సాహంతో గ్రామానికి మంజూరైన రోడ్లలో భాగంగా ఎస్టీ కాలనీలో బుధవారం సీసీ రహదారి పనులను వారు ప్రారంభించారు. అనంతరం గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

డ్రైనేజీ, పైపులైన్ల నిర్మాణం

రుద్రవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం గ్రామంలోని దళితకాలనీలో రూ.12లక్షలతో కొత్తగా పైపులైను, మురుగు కాల్వల నిర్మాణం చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుబ్రమణ్యం బుధవారం తెలిపారు. 360 మీటర్లు మురికికాల్వలు, పైపులైను 260 మీటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలు వేడి చేసి చల్లార్చిన నీరే తాగాలని సూచించారు.

పని వేళలు పాటించండి

రుద్రవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులు పని వేళలు పాటించాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని నరసాపురం సచివాలయంలో రిజిస్టర్లను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో అన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

బేతంచెర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గానిపల్లె తాండా గ్రామ సమీపంలోని కొండ పరిసర ప్రాంతాల్లో నాటుసారా స్థావరాలపై ఏఎస్ఐ వెంకటనారాయణ తన సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన మేనావత్ శంకర్ నాయక్ నిర్వహిస్తున్న నాటుసారా బట్టీని, 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించిందని ఆయన తెలిపారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

కొలిమిగుండ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి కోరారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పప్పుశనగ హెక్టారుకు రూ.210, వరి రూ.315, జొన్న రూ.148.50, మినుము రూ.118.75, వేరుశనగ రూ.160, ఉల్లి పంట హెక్టారుకు రూ.225 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి రైతు బీమా చేసుకోవాలని ఏవో సూచించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

చాగలమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగనేతాజీ తెలిపారు. బుధవారం మండలంలోని మద్దూరు, గొట్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కంది పంటలో ఎండు తెగుళ్లు నివారించండి

సంజామల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కంది పంటలో ఎండు తెగుళ్లను నివారించాలని వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి రైతులను కోరారు. బుధవారం మండలంలోని ముక్కమళ్ల గ్రామంలో పొలం బడి కార్యక్రమంలో భాగంగా రైతుతో కలిసి వ్యవసాయ అధికారి గ్రామంలో సాగైన కంది పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవోలు వెంకటేశ్వర రెడ్డి, శ్రీకాంత్, నరేష్ , రైతులు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు

అవుకు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అవుకు రిజర్వాయర్‌లో అంతర్భాగమైన పాలేరు చెరువు మట్టికట్టలపై భారీగా పెరిగిన ముళ్లపొదలను తొలగించే పనులను ఎస్సార్బీసీ అధికారులు బుధవారం చేపట్టారు. గత నెల 31వ తేదీన అవుకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి పాల్గొని గత నెల 25న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అవుకు రిజర్వాయర్‌ను ఆదుకోండి కథనంపై ఎస్సార్బీసీ ఈఈ సురేష్‌బాబును ప్రశ్నించారు. రిజర్వాయర్ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను సమావేశంలో ఆదేశించారు. దీంతో వారం రోజుల్లోనే మట్టి కట్టలపై పెరిగిన ముళ్లపొదలను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించే పనులు చేపట్టారు. త్వరలోనే భారీ కోతలకు గురైన మట్టికట్టల పనులను చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

బనగానపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో తలెత్తిన భూసమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు బనగానపల్లె ఆర్ఐ రాఘవేంద్ర అన్నారు. బుధవారం మండలంలోని మిట్టపల్లె గ్రామ శివాలయం వద్ద రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామ సర్పంచ్ తులసి రెడ్డి, మండల సర్వేయర్ గీతాగాయత్రి, సర్వేయర్ తనూజ, మహానందరెడ్డి, విజయనాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కుళాయిరెడ్డి, శేఖర్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 60 మందికి ఉద్యోగ అవకాశాలు

బనగానపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 60 మందికి ఉద్యోగ అవకాశాలు వివిధ సంస్థల్లో లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లలిత తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్, ఐక్యూఏసీ సమన్వయకర్త బడేసాహెబ్, జేకేసీ సమన్వయ్య కర్త సీతమ్మ, జేకెసీ మెంటార్ ఉమాశంకర్, కంపెనీ ప్రతినిధులు కుప్పన్, వేణుగోపాల్, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

బనగానపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కైప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అండర్ 14 విభాగంలో మహేంద్ర, అశ్వినీ, అండర్ 17విభాగంలో హరినాథ్, విజయలక్ష్మి రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పి.భాస్కర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 9న తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బాలవీరయ్యాచారిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

కొలిమిగుండ్ల: మండలంలోని తిమ్మనాయినిపేట ఆకాంక్ష స్పోర్ట్స్ అకాడమి విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బహుమతులు సాధించినట్లు ఫౌండేషన్ కార్యదర్శి బత్తుల రాజేష్ వెల్లడించారు. బాలికల పరుగు విభాగంలో టి.లక్ష్మీ శాంతి, శాలిని, బాలుర విభాగంలో మల్లి ప్రథమ, ద్వితీయ బహు మతులు సాధించినట్లు తెలిపారు.

అవుకు: మండలంలోని గుండ్ల శింగవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బిజయ్య బుధవారం తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ - 17 విభాగంలో బేస్‌బాల్ క్రీడలో లక్ష్మీప్రియ, సాఫ్ట్‌బాల్ విభాగంలో రాజేష్, అండర్ - 14 విభాగంలో బేస్‌బాల్ క్రీడలో పుష్ప క్రీడల్లో ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

చాగలమర్రి: చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న షా హీద్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కోటయ్య తెలిపారు. బుధవారం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపా ధ్యాయులు ఐడీకే శాస్త్రీ, ఉపాధ్యాయులు మహబూబ్ బాష, రవీంద్రా రెడ్డి, మహబూ బ్‌బాష, పీడీ దాదాపీర్, పీఈటీ భారతి పాల్గొన్నారు.

డోన్‌లో 11న జాబ్‌మేళా

డోన్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 11 న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భారతి, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆవిష్కరించారు. నిరుద్యోగ అభ్యర్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆర్‌టీఐ చట్టంపై అవగాహన

డోన్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతులకు ఆర్‌టీఐ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ మాట్లాడుతూ 2005లో అమలులోకి వచ్చిన ఆర్‌టీఐ చట్టాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. ఆర్‌టీఐ చట్టం ద్వారా సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు.

'కాంగ్రెస్ బలోపేతానికి తోడ్పడండి'

డోన్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బలోపేతానికి తోడ్పడాలని కాంగ్రెస్ నాయకులు సుబ్బుయాదవ్, మల్లెంపల్లె జనార్దన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపుగా పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ పంపించిన దీపావళి కానుకలను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయకుమార్, కాంగ్రెస్ నాయకులు జిల్లా కార్యదర్శి సిక్కిం నాగరాజు, మండల అ ధ్యక్షుడు రాజశేఖర్, బేతంచెర్ల మండల అధ్యక్షులు దోని, రామాంజనేయులు, తెలు గు విజయకుమార్ పాల్గొన్నారు.

చెంచుగూడెంలో సమగ్ర సర్వే

చాగలమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట చెంచుగూడెంలో బుధవారం సమగ్ర సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఫైరోజ్‌బేగం మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు చెంచుల సమగ్రాభివృద్ధిపై సర్వే చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీపీ ఆనంద్, ఈపీ శివ, ఏఎహెచ్‌ఏ ప్రదీప్, వీహెచ్‌ఏ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే సంక్షేమం'

చాగలమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చంద్రబాబుతోనే పేదల సంక్షేమం సాధ్యమని మర్రిపల్లె గ్రామానికి చెందిన అబ్దుల్ గఫార్ అన్నారు. బుధవారం చాగలమర్రిలో ఆటోయాత్ర చేశారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, బషీర్, మాబువలి పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్‌కు ప్రతిపాదనలు

ప్యాపిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల రోడ్లకు ఇరువైపుల జంగిల్ క్లియరెన్స్‌కు ప్రభుత్వానికి రూ.19.4లక్షల ప్రతిపాదనలు పంపామని ఆర్అండ్‌బీ డీఈ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలలోని పలు గ్రామాల రోడ్లకు ఇరువైపుల కంపచెట్లు పెరగడంలో రవాణాకు ఇబ్బందిగా మారిందన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.

బాలికల విద్యకు సహకరించాలి

బనగానపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్యకు ప్రతి ఒక్క రు సహకరించాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందా చారి అన్నారు. బుధవారం చెర్వుపల్లె గ్రామంలోని యూపీ పాఠశాలలో బ్ర హ్మానందాచారి ఆధ్వర్యంలో బాలికల విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నరసింహులు, ఉపాధ్యాయులు జయభారతి, రామలక్ష్మమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.